

# యువతీలోకం



## 'ఐతే ఏం?'

'ఐతే ఏం' ఇంకా ఈ లోకంలోకి వచ్చినట్లులేదు తన సుషుప్తావస్థనుంచి. 'ఐతేఏం' అంటే ఏమిటంటారా ? అదొక మహా బిరుదు. తలిదండ్రులు తమ మధురానురాగానికి చిహ్నంగా తమ ప్రథమ సంతానానికి 'రాధాకృష్ణుడు' అని నామకరణం చేశారు. కానీ ఈ రాధాకృష్ణుడనే అయిదున్నరడుగు శాల్తీ తన బుద్ధిబలం వల్ల తన కళాశాల్లోనూ, హాస్టల్లోనూ 'ఐతే నేం' ? అనే బిరుదు సంపాదించుకున్నాడు.

'ఓరేయ్ కృష్ణా, ఈదినం సూర్యుడు పడమట పుట్టి, తూర్పున అస్తమించాడురా' అంటే "అయితే ఏం, అదేదో సైంటిఫికల్ రియాక్షన్ అయిఉంటుంది" అని ముసుగుతన్ని పడుకునేరకం.

మిట్టమధ్యాహ్నం పూర్ణచంద్రుని పున్నమివెన్నెల వొచ్చిందన్నా, అర్ధరాత్రివేళ ఎండ నడినెత్తి కొచ్చిందన్నా కెన్నడీ కృశ్చేవ్‌లు ఆత్మీయులు కాగలిగారన్నా 'ఐతే ఏం ?' అని చప్పగ అనేసి ధూమపానంలో మునిగిపోయే కృష్ణావతారానికి పై బిరుదు ప్రదానం చేయడం ఆశ్చర్యజనకంగాదు.

అయితే సరసంలో విరసంలా, పాలలో నీళ్ళలా, నేతిలో డాల్డాలాగా ఈ 'ఐతే ఏం'అనే కృష్ణకూ, సార్థకనామధేయుడైన రాముకూ విడదీయరాని స్నేహం కుదిరింది. రాము ప్రతినిత్యం అయిపెక్సూ, క్యూపెక్సూ, ప్రేసియర్సూల యుగంలో జీవిస్తూకూడ సాయంసమయానికల్లా ఆంజనేయులు కోవెలకు వెళ్ళివచ్చేరకం. 'ఐతే ఏం' మాత్రం అహర్నిశలూ బొంబాయి తారల ఫోటోలతో, క్రికెట్ కామెంట్రీలతో, సామ్యవాదసమస్యలతో, కాలంగడిపే జాతికి చెందినవాడు.

ఇలాంటి వీరిద్దరికీ ఎలానేస్తంకుదిరిందా అన్నది తేలనిప్రశ్న. ఈ వింత ధోరణికి కారణం మనస్తత్వశాస్త్రం ప్రకారం రెండు విభిన్నతత్వాలు ఏకమయ్యేశక్తి, ఆ విభిన్నత్వంలోనే ఉందనటమేమో !

---

జి. పద్మావతి

ఇంతకూ చెప్పవచ్చిందేమిటంటే ఆనాటి ప్రత్యూషంలో 'ఐతే ఏం' ఇంకా తన నిద్రాదేవికి వీడ్కోలు ఇవ్వకముందే, తన మంజూషలాటి గదితలుపులు తెరవక ముందే ఓ నడికారువ్యక్తి ఈ 'ఐతేఏం'ని మర్యాదగా పూర్తి పేరుతో నిండుగా పిలుస్తూ తలుపు తడుతున్నాడు. తన సహాధ్యాయీ, సహనివాసీ అయిన రాము ఆగంతుకుణ్ణి కృష్ణతండ్రిగా ఆనవాలుపట్టి లోనికి ఆహ్వానించాడు.

'ఐతే ఏం' కి మేనగోడలు వొకామె వుంది. •ఆమెనుఇచ్చి తన కుమారునికి వివాహం చెయ్యాలనే సంకల్పం అతని తండ్రికి వుంది. ఈ మధ్య ఐతే ఏం అక్కడక్కడా మేనరికం చేసుకోనని అనటం విని ఆయన కొడుకుదగ్గరకు వచ్చాడు.

'ఐతేఏం' తన తండ్రినిచూసి ఒక్క పిసరంత ఆశ్చర్యం ప్రకటించాడు. 'ఐతేఏం' సిద్ధాంతం కాస్త వెనుకబడింది. కారణం తన రెండుదశాబ్దాల జీవితం లోనూ ఏ గుమస్తానో పాలేరునో తనున్న చోటికిపంపి క్షేమసమాచారాలు తెలిసికొనే తన తండ్రి, యీనాడు ఇంతటి పట్టణానికి ఒంటరిగా కార్డుముక్కైనా రాయకుండా పుటుక్కున ఊడిపడటం, ముప్ఫై నయాపైసాల ఆశ్చర్యం, పదినయా పైసాల భయం కల్గించింది 'ఐతేఏం'కి. మిగతా అరవై నయాపైసాల్తో 'ఐతేఏం' సూత్రాన్ని తిరిగి పట్టుకొచ్చి నిటారుగా కూర్చున్నాడు తండ్రి కెదురుగ్గా.

'ఐతేఏం', పెడసర ప్రవర్తనా, ప్రస్తుతం మేనరికం అధ్యాయంలో జరుగుతున్న కృష్ణజీవితపుటలూ తెలిసిన రాము తండ్రీ కొడుకులమధ్య ఏం సంవాదం జరుగుతుందోనని బయట వరండాలో చదువుకుంటూ కూర్చున్నాడు.

ఏ మహామంత్రుల సమావేశంలోనూ ఉండని నిశ్శబ్దం గది నావరించింది. జీవితానికి సంబంధించిన విషయాలు ఉత్తరాల్లో తీవ్రంగానూ రాయవచ్చు; నిశితంగానూ విమర్శించవచ్చు: కానీ మొదటిసారిగా, అదీ పెద్దలఎదుట మాటాడాల్సివస్తే మాత్రం అభిమన్యుడు పద్మవ్యూహంలో పడ్డట్టే ఉంటుంది. ఆ బాధతో కాలేజీ డిబేట్సులో పేరుగాంచిన కృష్ణ మౌనంగానే కూర్చున్నాడు.

ఇలాటి సున్నితవిషయాల్లో ఎదుటివారి మనసును బట్టి మాట్లాడే పెళ్ళిళ్ళ పేరయ్యలూ మధ్య వర్తులూలాగ కాక కృష్ణతండ్రి నేరుగా ఉపోద్ఘాతరహితంగా అడిగేశాడు"-ఏంరా, మరి నీవు మీ అత్త కూతుర్ని చేసికోవడం నిజమా లేదా?"- అని.

తనతండ్రి అన్నవాక్యం విరామానికి వీలుగావుంటే 'ఐతే ఏం' అనే అస్త్రం విసిరేసి కొద్దిపాటి విరామం పొందేవాడు కృష్ణ. ప్రశ్నకు తన అస్త్రం సరిపోదాయె. అయినా పదేళ్ళుగా చదివిన చదువూ,

స్టేజీఎక్కి మాటాడగల ధైర్యం ఊరక పోవుగా ? అటు 'మామ్' సాహిత్యంలోని జీవిత వైవిధ్యాన్ని, ఇటు తుర్జినీవ్, డాస్టవిస్కీల రచనల్లోని మానసికద్వంద్వాన్నీ, మన ఇటీవలి సాహిత్యంలోని విమర్శనాత్మక అభ్యుదయాన్నీ ఆస్వాదించిన కష్ణబుర్ర చురుకుగా పనిచేయసాగింది.

ఫలితంగా, "నేను మేనరికంచేసికోను నాన్నా. బాల్యంనుంచి పరిచయమున్న వాళ్ళనుతప్ప ఎవరినైనా చేసికుంటాను." అనేసి జవాబుకైనా ఎదురుచూడక, పేస్టూ బ్రషూ, తువ్వాలుతో గది ఇవతల కొచ్చాడు మన 'ఐతే ఏం'.

అతని తండ్రి ఆలోచిస్తూ కూర్చున్నాడు.

రగడ జరుగుతుందేమోనని భయపడ్డాడు రాము. ఇక తనపని పూర్తిచేయాలని వరండాలోంచి గదిలోనికివచ్చి ఎంతో వినయ విధేయతల్తో కృష్ణతండ్రిని పలుకరించి, ఓదార్చి ఓ కాఫ్యాలయానికి తీసికెళ్లాడు. కృష్ణస్వభావం తెలిసిన రాము కృష్ణఇష్టప్రకారమే చేయడం మంచిదని ఆయనకు నచ్చజెప్పాడు.

పరీక్షల అనంతరం రాము కృష్ణలు స్వస్థలాలు చేరుకున్నారు. వేసంగి సెలవుల్లో కృష్ణకు సరికొత్త సంబంధం స్థిరపడిందనీ, పెళ్ళికి తప్పక రావాలనీ 'ఐతే ఏం' నుంచి ఓ రిజష్టరు కవరు వచ్చింది రాముకు. సంబరంగా బయల్దేరి రాము కృష్ణపెళ్ళితంతు వైభవాన్ని చూశాడు. అమ్మాయి-అంటే "ఐతే ఏం" గారి శ్రీమతీ మణి-అచ్చు అతని మేనత్త కూతురులాగే ఉంది. కొంపదీసి ఆ వద్దన్న అమ్మాయే పెళ్ళికూతురైందేమో అనుకునేందుకు, ఆ సదరు అమ్మాయి రెండునెలల క్రితమే శ్రీమతిఅయి తమ శ్రీవారితో పాటు పెళ్ళిపందిరిలో తిరుగుతూందాయె.

"అచ్చంగా నీ మేనత్త కూతురిలాగే వుందోయ్." అన్నాడు రాము 'అయితే ఏం' తో.

"మనిషినిపోలిన మనుషులు ఉంటార్లేవోయ్" అన్నాడు 'ఐతే ఏం.'

ఓ ఆర్నెల్లతర్వాత తన 'ఎమ్మే' డిగ్రీతో తెలుగురాజధానిలో ఉద్యోగదుస్తుల్లో ఉన్నాడు 'ఐతే ఏం'. 'ఎమ్మే' ఫస్టులో పాసై సెక్రటేరియట్‌లో పని చేస్తున్న రాము ఓ శుభోదయాన సిటీబస్ స్టాండ్‌లో కృష్ణకు ఎదురుపడ్డాడు. ఆలింగనాలు అవీ ఇవీ అయినాక విడిపోయిన నేస్తులు ఇద్దరూ హోటళ్ళో దూరారు.

కృష్ణ మెల్లగా చెప్పసాగాడు "ఒరే రామూ, నావైఫ్ ఎవరనుకున్నావ్ ? మా మేనత్త కూతురేనట ?"

ఐస్‌క్రీమ్ చెమ్చా అలాగే చేతుల్లోనే ఉండిపోయింది రాముకు. ఆశ్చర్యంగా కృష్ణవైపు చూస్తూ, "మీ మేనత్తకూతురు

వివాహిత కదరా ? ఆవిడగానీ 'హైడ్ అండ్ జెకిల్' లాగా ద్విపాత్రాభినయం చేస్తూందా ?" అని ప్రశ్నించాడు రాము.

"అదికాదురా; మా మేనత్తకు కవల అమ్మాయిలయితే పెద్ద అమ్మాయిని నాకివ్వాలనుకున్నారట. రెండో అమ్మాయిని మా మేనత్తదూరపుబంధువులెవ్వరో దత్తత తీసికున్నారట. వారికీ మాకూ రాకపోకలు లేనందువల్ల ఆ దత్తత తీసికున్న అమ్మాయిది కొత్త సంబంధమే అయింది. ఆ దత్తపుత్రికే నా శ్రీమతీ మణి" అని తన వ్యాఖ్యానం ముగించి కృష్ణ ఐస్ తినడంలో మునిగిపోయాడు.

రాము తన ఆశ్చర్యాంబుధి నుండి గట్టునపడి, "అయితే ఈ విషయం మీ నాన్నగారికూడా తెలియదా ?" అన్నాడు ఆత్రుతగా.

"సంబంధం ఉత్తరాదిన దూర ప్రదేశంలో ఉండబట్టి మొదట్లో తెలీదట. ముహూర్తం నిశ్చయమయేముందు మా అత్త అసలు సంగతి చెబితే నాకా విషయం తెలిస్తే మానేస్తానేమోనని, నాన్నగారు కూడా నాకు తెలియకుండా రహస్యంగా ఉంచారు."

"నే చెప్పాను గదరా కృష్ణా. మనం ఎంత వద్దనుకున్నా మనకు తెలియకుండా కొన్ని జరుగుతూంటవి. ఇప్పుడైనా ఒప్పుకుంటావా ఎలా జరుగాల్సింది అలా జరగాల్సిందేనని?" అని ఆశగా చూశాడు రాము.

కృష్ణ ఒక్కమారుగా కుర్చీలో నిటారుగా కూచుంటూ "అదెట్లారా ? నేను వద్దన్న అమ్మాయిని మాత్రం నేను చేసికోలేదుగా ? అంతా కర్మప్రకారం జరగాలి అని చేతులుముడుచుకొని కూర్చొని ఉంటే ఈ మార్పుగూడా జరిగేదికాదు. అమ్మాయి వేరే గనుక ఇది కొత్త సంబంధమే. మానవ ప్రయత్నంలోనే జీవితంవుంది" అంటూ లేచాడు కృష్ణ.

"ఏదయినా నువ్వు చేసుకున్నది. మేనత్త కూతుర్నేగదా?" అన్నాడు రాము తన ఛాందసపు బుద్ధినివదలలేక.

"అయితేఏం ?" అన్నాడు మన అయితే ఏం-కృష్ణ.

